లిఫ్ట్ నిర్మాణ పనులకు శంకుస్థాపన



లిఫ్ట్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వివేకానంద నగర్ పార్కులో సీనియర్ సిటిజన్స్, యోగ భవనానికి వచ్చే వారి కోసం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ సొంత నిధులు రూ.5 లక్షల అంచనా వ్యయంతో చేపట్టబోయే లిఫ్ట్ నిర్మాణం పనులకు మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావుతో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యోగ కోసం వచ్చేవారికి, మహిళలకు, సీనియర్ సిటిజన్లకు సౌకర్యార్థం లిఫ్ట్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో చందానగర్ డివిజన్ బీఆర్‌యస్ పార్టీ అధ్యక్షులు రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు.

'సమస్యలను పట్టించుకోని అధికారులు'

మూసాపేట: కూకట్‌పల్లి ఇన్‌చార్జి జోనల్ కమిషనర్‌కు కూకట్‌పల్లి యువజన కాంగ్రెస్ నాయకుడు జిట్టా సునీల్ కుమార్ యాదవ్ శనివారం కూకట్‌పల్లి, మూసాపేట టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యంపై ఫిర్యాదు చేశారు. కూకట్‌పల్లి మున్సిపాలిటీ కార్యాలయంలోని టౌన్‌ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యం వల్ల కూకట్‌పల్లి నియోజకవర్గంలో డ్రైనేజీ సమస్యలు, ట్రాఫిక్ సమస్యలు, పార్కింగ్ సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. పరిమితికి మించి భవన నిర్మాణాలు చేస్తున్నా కూడా టౌన్ ప్లానింగ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించటం వలన ఈ సమస్యలకు కారణమన్నారు. 100 నుంచి 300 గజాల పరిమితికి మించి అంతస్తులు నిర్మిస్తున్నా అందులో కనీసం పార్కింగ్ లేకున్నా 5, 6 అంతస్తులు నిర్మిస్తున్నారని తెలిపారు. ఇలా నిర్లక్ష్యం చేయటం వల్ల ప్రతి సంవత్సరం వర్షాకాలంలో డ్రైనేజీ సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఈటలకు బీజేపీ నేతల సత్కారం



ఎంపీ ఈటల రాజేందర్‌కు సన్మానిస్తున్న బీజేపీ నేతలు

ఓల్డ్ బోయిన్‌పల్లి: మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యుడిగా విజయం సాధించిన ఈటల రాజేందర్‌ను ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ బీజేపీ నాయకులు కలిసి ఘనంగా సన్మానించారు. శనివారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని మనసా సరోవర్ హైట్స్‌లో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఆర్. సంతోష్‌కుమార్‌గౌడ్ కలిసి శాలువా కప్పి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

కలుషిత నీటి సమస్యను పరిశీలించిన అధికారులు

బాలానగర్: ఫతేనగర్ డివిజన్ నేతాజి కాలనీ జాన్సన్ గ్రామర్ స్కూలు వీధిలో స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్, జలమండలి మేనేజర్ అనిల్ కుమార్‌తో కలిసి సమస్యని అడిగి తెలుసుకున్నారు. వారం రోజులుగా సరఫరా అవుతున్న కలుషిత నీటిని వారు చూపించారు. కలుషిత నీటి సమస్యలను నాలుగైదు రోజుల వ్యవధిలో పరిష్కరిస్తామని కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నేతాజి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరి వెంకట రాంనర్సయ్య, స్వామి, శేఖర్ గట్ల, సురేందర్ నాయుడు, పద్మావతి పాల్గొన్నారు.

సపోర్టింగ్ స్టాఫ్‌కు వేతనం పెంచాలి



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతి పత్రం అందిస్తున్న రాష్ట్ర అసోసియేషన్ ప్రతినిధులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: బస్తీ దవాఖానాలో సపోర్టింగ్ స్టాఫ్ ఐదేళ్లుగా రూ. 10 వేల వేతనంతో పని చేస్తున్నారని వారికి కుటుంబ పోషణ ఇబ్బందిగా మారిందని తెలంగాణ బస్తీ దవాఖాన కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు కేంద్ర మంత్రిని కలసి కోరారు. శనివారం కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డిని అసోషియేషన్ అధ్యక్షుడు సుమన్ అధ్వర్యంలో ప్రతినిధులు కలసి దవాఖానలో పని చేస్తున్న సిబ్బంది వేతనాలపై వివరించారు. నగరంలో నెలకు రూ 10 వేల వేతనం సరిపోదని, ఈ విషయం అలోచించి తమకు న్యాయం చేయాలని కోరారు.

పూడిక తీత పనులు పరిశీలించిన కార్పొరేటర్

బాలానగర్: వర్షాకాలం నేపథ్యంలో బాలానగర్ డివిజన్‌లోని ప్రధాన నాలా కల్యాణి నగర్ నుంచి బోజై ఫంక్షన్ హాలు వరకు జరుగుతున్న నాలా పూడికతీత పనులను బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యల్లో భాగంగా వర్షపు నీరు సాఫీగా వెళ్లేందుకు వీలుగా నాలాలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌యంసి ఏఈ మొహమ్మద్ రషీద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాములు, బీఆర్‌యస్ పార్టీ నాయకులు నర్రా దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని ఏవిబి పురంలోని శ్రీ భ్రమరాంబిక మల్లిఖార్జున స్వామి ఆలయం 18వ వార్షికోత్సవం సందర్భంగా శ్రీభ్రమరాంబిక సహిత మల్లికార్జున స్వామి వారి కళ్యాణ మహోత్సవం శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్, సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నప్రసాదం కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో దారాసింగ్, వాసు, రమణారావు, మేకల రమేష్, రఘువయ్య, వెంకట్‌రావు, కిరణ్, పాపారావు, మేఘనాథ్‌తదితరులు పాల్గొన్నారు.



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతి పత్రం అందిస్తున్న రాష్ట్ర అసోసియేషన్ ప్రతినిధులు

వర్షాకాలం భయం.. భయం



● వరద సమస్యతో స్థానికుల ఇబ్బంది ● పట్టించుకోని అధికారులు



వర్షాకాలంలో ఓక్షిత్ కాలనీ (ఫైల్)

నిజాంపేట్/సుభాష్‌నగర్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని పలు ప్రాంతాలు బండారి లేవుట్, పూజిత లేఅవుట్, రెడ్డి అవెన్యూ, అదిత్యగార్డెన్ లాంటి ప్రాంతాలు భారీ వర్షాలకు నీట మునిగేవి. ప్రధానంగా వందలాది అపార్ట్‌మెంట్లు ఉన్న బండారీ లే అవుట్‌కు ప్రతి సారీ వర్షాకాలంలో వరద ముంపు ఉండేది. కాని ప్రస్తుతం వరద నీరు దిగువకు పోయేందుకు అధికారులు నాలా పనులను పూర్తి చేశారు. అదే విధంగా తుర్క చెరువు అలుగును సైతం తగ్గించడంతో బండారి లేవుట్‌కు ముంపు తీవ్రత తగ్గింది. భారీ వర్షాలు కురిన సమయంలో రెండు మూడు రోడ్లపై వరద నీరు తక్కువ స్థాయిలో నిల్వ ఉంటుంది. ఇక సెల్లార్‌లలోకి అయితే నీరు వస్తుంది. రెడ్డి అవెన్యూలో సైతం వదర నీరు నిల్వ ఉంటుంది. బండారి లేఅవుట్‌కు ఈ కాలనీ దిగువ ఉండటంతో రోడ్లపై వరద సమయంలో నీరు నిల్వ ఉంటుంది. ఈ సమస్య పరిష్కారానికి అధికారులు పెద్దగా చేయాల్సిన పని ఏమి లేదు. బాచుపల్లి లోని పూజిత లేవుట్ , కేకేఎం కాలానీలు , అదిత్య గార్డెన్ లాంటి కాలనీలు లోతట్టు ప్రాంతంలో ఉండటంతో ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు వచ్చి ప్రతి సారి వర్షాకాలంలో ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంది. ఈ కాలనీల్లో గతంతో పోల్చితే ఇప్పటికి ఈవదర నీరు నిల్వ ఉండకుండా చేపట్టాల్సిన చర్యలు ఏమి తీసుకోలేదు. ఎలాంటి ప్రత్యామ్నాయాలు చపట్టలేదు. వర్షం పడ్డ ప్రతి సారి ఈ సమస్య పునరావృత్తం అవుతూనే ఉంది.

గాజులరామారం డివిజన్‌లో....

గాజుల రామారం డివిజన్‌లోని పెద్ద చెరువు దిగువన ఉన్న ఓక్షిత్ ఎంక్లేవ్ 1,2 కాలనీలు గత 5 సంవత్సరాల క్రితం వెలిశాయి. ఈ కాలనీని అనుకుని సుమారు 30 ఫీట్ల నాలా ఉంది.కొంత మంది నాలా స్థలంలో కబ్జాలు చేసి నిర్మాణాలు చేపట్టారు. దీంతో భారీ వర్షాలకు కురిసిన సమయంలో కాలనీలు జలదిగ్బంధం అవుతున్నాయి. అధికారులు మాత్రం ప్రత్యామ్నాయంగా రూ. 18 కోట్ల నిధులతో 500 మీటర్ల పొడవు కృత్రిమ నాలా నిర్మాణానికి తెర లేపారు. కబ్జాకు గురైన నాలాను వదిలేసి పనులు పక్కనుంచి చేపట్టడంతో స్థానికులు పనులను అడ్డుకున్నారు. స్థానికులు గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేసిన ఫలితం లేకుండా పోయింది. ఇక్కడ కూడా వర్షం పడ్డ ప్రతి సారి రోడ్లన్నీ జలమయం అవుతాయి. అధికారులు మాత్రం పూర్తి స్థాయిలో పరిష్కార మార్గాలు చేపట్టలేదు.







బాచుపల్లి అదిత్యగార్డెన్‌కాలనీలో ఇండ్ల ముందు వర్షం నీరు



అదిత్యగార్డెన్‌లో వరద నీరు నిల్వ ఉండకుండా ఎలాంటి పనులు చేపట్టని దృశ్యాలు

ఇదేమి న్యాయం



గత రెండు సంవత్సరాలుగా వర్షం నీటిలో పడరాని పాట్లు పడుతున్నాం. నాలా కబ్జాకోరులను వదిలేసి అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. కళ్ళ ముందు నాలా కబ్జా జరుగుతుంటే అధికారులు అడ్డుకోవాల్సింది పోయి. కబ్జాకోరులకి వత్తాసు పలుకుతున్నారు.ఈ విషయమై కోర్టుకు వెళ్తాం.

– సుర్పరాజు, ఓక్షిత్ కాలనీ

వర్షాకాలం వస్తోందంటే భయం



ఎవరో కట్టు కాలువను కబ్జా చేస్తే వారి మీద చర్యలు తీసుకోవాల్సింది పోయి. మధ్య నుంచి మరో నాలాకు పనులు చేపట్టడేమిటో అర్థం కావడం లేదు. మా ఇండ్ల మధ్య నుంచి మూడు మీటర్ల కృత్రిమ నాలా కోసం తవ్వకాలు చేస్తుంటే ప్రహరీలు కూలిపోతున్నాయి.వర్షకాలం వస్తుదంటే భయంగా ఉంది.

– శివకుమార్

తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రులకు అప్పగింత

గంటలోపే ఆచూకీ కనుక్కున్న పోలీసులు



తప్పిపోయిన బాలుడితో తల్లిదండ్రులు

మోతీనగర్: తప్పిపోయిన బాలుడిని పోలీసులు గంటలోపే వెతికి తల్లిదండ్రులకు అప్పగించిన సంఘటన అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. సీఐ సామల వెంకటరెడ్డి తెలిపిన మేరకు.. బిహార్ రాష్ట్రానికి చెందిన మల్లేష్ కుటుంబ సభ్యులు అల్లాపూర్ డివిజన్ రాజీవ్ గాంధీ నగర్‌లోని ఈ బ్లాక్‌లో నివాసం ఉంటున్నాడు. శనివారం ఉదయం మల్లేష్ కుమారుడు అమర్ కుమార్ ఇంటి ముందు ఆడుకుంటూ తప్పిపోయాడు. వెంటనే తల్లిదండ్రులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు బృందాలుగా ఏర్పడి సుమారు గంటలోపే అమర్‌కుమార్‌ను గాలించి తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో బాలుడి తల్లిదండ్రులు, స్థానికులు వెంటనే స్పందించిన పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

అవార్డులకు దరఖాస్తు చేసుకోండి

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలోని 5 నుంచి 18 సంవత్సరాల లోపు వయస్సు గల ప్రతిభావంతులైన బాలలకు, పిల్లల రక్షణ సంరక్షణకు కృషి చేస్తున్న స్వచ్ఛంద సేవ సంస్థలకు ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డుల ప్రదానం చేస్తున్నట్లు జిల్లా మహిళా శిశు దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు వచ్చే నెల 31 వరకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

అంగన్‌వాడీలకు ఆరు నెలల అద్దె రుసుం మంజూరు

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించిన 26 నెలల అద్దె రుసుమునకుగానూ ఇప్పటి వరకు ఆరు నెలల అద్దె రుసుం మాత్రమే మంజూరైనట్లు జిల్లా మహిళా శిశు దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22న 'సాక్షి' మినీలో 'అవస్థల్లో అంగన్‌వాడీలు' శీర్షికతో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. అద్దె రుసుం కోసం బిల్లులు సమర్పించామని, ఇంటి యాజమానుల ఖాతాలో డబ్బులు జమ కాగలవని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు ఏప్రిల్ 2024 వరకు గౌరవ వేతనం చెల్లించామని, మే నెలకు సంబంధించిన వేతనం అందజేయాల్సి ఉందని తెలిపారు. జిల్లాలోని అన్నీ అంగన్వాడీ కేంద్రాలకు మిషన్ భగీరథ పథకం ద్వారా తాగు నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు కూరగాయలు, గ్యాస్ బిల్లులకు సంబంధించి ఫిబ్రవరి 2024 వరకు చెల్లించామని తెలిపారు. ఇంకా మూడు నెలలకు సంబంధించిన కూరగాయలు, గ్యాస్ బిల్లులను త్వరలో చెల్లిస్తామని పేర్కొన్నారు. జిల్లాలోని ఆరు అంగన్‌వాడీ కేంద్రాలలో మరుగుదొడ్ల మరమ్మతు పనులు కొనసాగుతున్నాయని, పూర్తయిన వెంటనే వినియోగంలోనికి తీసుకోస్తామని తెలిపారు. మరికొన్నింటికి కొత్తగా మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టేందుకు నిధులు మంజూరు కాగా, ఈ పనులను పంచాయతీ రాజ్ శాఖ చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమాచారాన్ని జిల్లా కలెక్టర్ గౌతమ్ దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

పొదుపుతో పేదరికం దూరం

ఉస్మానియా యూనివర్సిటీ: పొదుపుతో పేదరికాన్ని దూరం చేయవచ్చని పలువురు వక్తలు పేర్కొన్నారు. శనివారం యూపీఎస్సీ-2024 ర్యాంకర్లు నిరుపేద బాలికల కోసం ఓయూ క్యాంపస్ యూనివర్సిటీ పోస్టాఫీసులో స్ఫూర్తి పేరుతో సుకన్య సమృద్ధి ఖాతా పాస్ పుస్తకాలను అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వివిధ మార్గాల ద్వారా వచ్చే ఆదాయాన్ని పొదపు చేసి పిల్లలను ఉన్నతంగా చదివించాలన్నారు. అనంతరం వివిధ ప్రాంతాలకు చెందిన 100 మంది నిరుపేద బాలికలకు రూ.1000తో జమ చేసిన సుకన్య సమృద్ధి ఖాతా పాసు పుస్తకాలను అందజేశారు. యూపీఎస్సీ 3వ ర్యాంకర్ అణ్యనరెడ్డి, ఐపీఓఎస్ కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో యూపీఎస్సీ ర్యాంకర్లతో పాటు పిల్లల తల్లిదండ్రులతో పోస్టు మాస్టర్ జనరల్ శ్రీలత, నర్సింహరెడ్డి, రాంరెడ్డి, అనురాగ్‌సింగ్, సుధాకర్ రెడ్డి, నర్సింహరావు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా వ్యర్థాల డంపింగ్

- ఏసీబీ కార్యాలయం ఎదుట జంతు కళేబరాల మూటలు
- దుర్గంధభరితంగా పరిసరాలు
- వాహనదారులు, పాదచారులకు తప్పని ఇబ్బందులు



బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12 ఏసీబీ ఎదుట డంపింగ్ చేసిన వ్యర్థాలు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-12లోని ఎమ్మెల్యే కాలనీకి వెళ్లే రోడ్డులో ఏసీబీ కార్యాలయం, చర్చి ముందు ఖాళీ స్థలం చెత్తాచెదారానికి, వ్యర్థాలకు డంపింగ్ యార్డుగా మారింది. ఇటీవల జంతు కళేబరాల మూటలు వందల సంఖ్యలో ఇక్కడ పారేసి వెళ్లిపోయారు. దీంతో దుర్వాసనలు గుప్పుమంటున్నాయి. చెత్తాచెదారం పెద్ద ఎత్తున పేరుకుపోతుండడం, దుర్వాసనలు, దుర్గంధం, స్థానిక రాకపోకలకు నరకాన్ని చూపిస్తుంది. ఇక్కడ చెత్త వేయకుండా, కళేబరాల వ్యర్థాల మూటలు వేయకుండా ప్రణాళికలు రూపొందించడంలో జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య విభాగం అధికారులు చేతులెత్తేశారు. పక్కా ప్రణాళికలు రూపొందించి ఇక్కడ చెత్త కుప్పలు పేరుకుపోకుండా చూడాల్సిన ఎస్ఎఫ్ఏలు చేతులెత్తేస్తున్నారు. ఈ దుర్వాసనలపై ఏసీబీ ఉన్నతాధికారులు కూడా ఫిర్యాదులు చేసినా స్పందన కరువవుతుంది. కారుల్లో వెళ్తున్న వారికి కూడా ముక్కుపుటాలదిరే దుర్వాసనలు వస్తున్నాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక్కడ గంజాయి బ్యాచ్ కూడా అరాచకాలకు పాల్పడుతుంది. ఈ ప్రాంతంలోకి వెళ్లకుండా ఫెన్సింగ్ నిర్మించి రోడ్డు పక్కన ఫుట్‌పాత్ నిర్మిస్తే గానీ ఈ సమస్య పరిష్కారం కాదని స్థానికులు అంటున్నారు.

ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన కాంగ్రెస్ నేతలు

కూకట్‌పల్లి: బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని కైత్లాపూర్‌లో ఇందిరమ్మ కాలనీ డబుల్ బెడ్ రూం ఇళ్లను శనివారం కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేపీహెచ్‌బీ కాలనీ థర్డ్ ఫేజ్‌లోని బతుకమ్మ కుంట పార్కులో వీధి దీపాలు వెలగటం లేదని స్థానికులు సీనియర్ నాయకుడు శేరి సతీష్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే పార్కులో వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని అక్కడికక్కడే సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, దిండి అరవింద్ రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



మోతీనగర్: వినాయకరావు నగర్‌లో నీలిమ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆసుపత్రి చైర్మన్ డా. పి. శ్రీనివాస్ అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో నవీన్‌రెడ్డి శ్రీ తేజ తదితరులు పాల్గొన్నారు.

రాంగ్‌రూట్‌లో వాహనం నడిపిన వారిపై కేసు

మాదాపూర్: రాంగ్‌రూట్‌లో వచ్చి ప్రమాదాలకు గురికావద్దని మాదాపూర్ ట్రాఫిక్ సీఐ నర్సయ్య తెలిపారు. మాదాపూర్‌లో శనివారం నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో ఆవాస హోటల్ యూటర్న్ వద్ద రాంగ్‌రూట్‌లో వస్తున్న 12 మంది వాహనదారులను పట్టుకున్నారు. అందులో ఒకరిపై ఎఫ్ఐఆర్ చేశారు. మిగిలిన 11 మందికి జరిమానాలు విధించారు. పట్టుబడిన వారికి ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు



ప్రత్యేక తనిఖీలు చేస్తున్న డీసీపీ

మూసాపేట: కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం బాలానగర్ జోన్ డీసీపీ కె. సురేష్ కుమార్, కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాస్‌రావుతో కలిసి ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. కైత్లాపూర్ ఓపెన్ గ్రౌండ్‌లో, కేపీహెచ్‌బీ మెట్రో స్టేషన్, భాగ్యనగర్ స్టేషన్‌లో తనిఖీలు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటం, ప్రజా రద్దీ ప్రాంతాల్లో గొడవలకు పాల్పడటం, కళాశాలలు ప్రారంభం కావడంతో విద్యార్థినీలను పోకిరీలు ఇబ్బందులు పెట్టడం వంటివి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సింక్రొనీకి గ్రేట్ ప్లేస్ టూ వర్క్ పురస్కారం

సాక్షి, సిటీబ్యూరో: సానుకూల, ఉద్యోగ-కేంద్రీకృత సంస్కృతిని పెంపొందించడం ద్వారా మాదాపూర్‌లోని ప్రముఖ ఫైనాన్షియల్ సర్వీసెస్ కంపెనీ సింక్రోనీ దేశంలో పనిచేసేందుకు ఎంచుకోదగ్గ అత్యుత్తమ కంపెనీలలో ఒకటిగా గ్రేట్ ప్లేస్ టూ వర్క్ ఇన్ ఇండియా పురస్కారం లభించిందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. గత ఏడేళ్లుగా ఈ పురస్కారాన్ని అందుకుంటున్నామని, ఆరోగ్యకరమైన పని వాతావరణాన్ని సృష్టించడం ద్వారా తమ ఉద్యోగులు పూర్తి సామర్థ్యాన్ని వెచ్చించేలా ప్రోత్సహిస్తూండడమే ఈ ఘనతకు కారణమని వివరించారు.

మోకాలి దెబ్బ.. ఆర్థోస్కోపీ చికిత్స

గచ్చిబౌలి: ఎనిమిదేళ్ల పాప ఆడుకుంటుండగా మోకాలికి దెబ్బ తగలడంతో ఆపరేషన్ లేకుండానే నయం చేసినట్లు ఆర్థోస్కోపీ, స్పోర్ట్స్ మెడిసన్ సర్జన్ డాక్టర్ ప్రతాప్ పర్వతనేని తెలిపారు. ఎంఆర్ఐలో యాంటీరియర్ క్రూషియేట్ లిగమెంట్(ఏసీఎల్) చిరిగినట్లు గుర్తించామని తెలిపారు. ఏసీఎల్ టేర్ అవ్వడం ఎనిమిది సంవత్సరాల వయస్సులో అరుదుగా జరుగుతుందన్నారు. పిల్లలకు ఏసీఎల్ టేర్ శస్త్ర చికిత్స చేయడం కొండాపూర్ కిమ్స్ ఆస్పత్రిలో మొదటిసారి అని పేర్కొన్నారు. ఆర్థోస్కోపీ శస్త్ర చికిత్స, ఫిజియోథెరపి ద్వారా లిగమెంట్ సమస్యను పూర్తిగా నయం చేసినట్లు వివరించారు. పూర్తి స్థాయిలో కోలుకున్న ఆ పాప స్కూల్‌కు వెళుతుందని, ఆడుకుంటుందని తెలిపారు.